క్లుప్తంగా

జీజీహెచ్‌కి ఆరు వీల్‌చైర్లు



వీల్‌చైర్లతో సూపరింటెండెంట్లు

ఏలూరు టౌన్: ఏలూరు సర్వజన ఆసుపత్రిలో రోగుల కోసం ఒక దాత ఆరు వీల్‌చైర్లను అందజేశారని సూపరింటెండెంట్, అదనపు డీఎంఈ ఎంఎస్ రాజు తెలిపారు. సోమవారం వాటిని సిబ్బందికి ఆయన అందజేశారు. రోగులకు మాత్రమే వీల్‌చైర్లు వినియోగించాలని, సామగ్రిని తరలించేందుకు ఉపయోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ ధన్యశ్రీ, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, ఎస్తేరురాణి, నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ వరలక్ష్మి, హెడ్ నర్స్ అమ్మాజీ, భారతి, హెల్ప్‌డెస్క్ సిబ్బంది ఏసురత్నం తదితరులున్నారు.

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులుగా రవి, నాగమణి



ఎ.రవి



ఎం నాగమణి

ఏలూరు (టూటౌన్): సీపీఎం రాష్ట్ర నూతన కమిటీలోకి ఆ పార్టీ ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు మొడియం నాగమణి ఎన్నికయ్యారు. ఈ మేరకు జిల్లా కార్యదర్శి ఎ.రవి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో నెల్లూరు జిల్లా నెల్లూరు పట్టణంలో సీపీఎం రాష్ట్ర మహాసభలు జయప్రదంగా నిర్వహించామని తెలిపారు. మూడో తేదీన పార్టీ నూతన కమిటీని ఎన్నుకున్నట్టు వివరించారు. మహాసభలకు ఏలూరు జిల్లా నుంచి 21 మంది ప్రతినిధులు హాజరయ్యారని రవి తెలిపారు.

రిటైర్డ్ అదనపు ఎస్పీ రత్నయ్య మృతి

ఏలూరు టౌన్: ఏలూరు విద్యానగర్‌కు చెందిన రిటైర్డ్ అదనపు ఎస్పీ పానుకు రత్నయ్య (85) అనారోగ్యంతో సోమవారం సాయంత్రం తన నివాసంలో మరణించారు. పోలీస్ శాఖలో ఎస్సైగా చేరిన ఆయన ఏలూరు నగరంలో వివిధ స్టేషన్లలో ఎస్సైగా, సీఐగా పని చేశారు. అదనపు ఎస్పీగా నల్గొండలో 2000 సంవత్సరంలో పదవి విరమణ పొందారు. అనంతరం న్యాయవాదిగా సేవలు అందించారు. ఆయన భార్య రిటైర్డ్ టీచర్ 2020లో మరణించారు. ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

క్లాప్ ఆటో డ్రైవర్ల తొలగింపు

- 1 నుంచి నగరపాలక సంస్థలో విధులకు దూరం
- నోటీసులు లేకుండా తొలగించడంపై ఆందోళన
- రోడ్డున పడ్డ 60 కుటుంబాలు



వాహనంలో చెత్త వేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్ (ఫైల్)



విధుల నుంచి తొలగించడంతో కార్యాచరణపై చర్చిస్తున్న ఆటో డ్రైవర్లు

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న 60 మంది క్లాప్ ఆటో డ్రైవర్లను ఈనెల ఒకటో తేదీను విధుల నుంచి తొలగించారు. ఎటువంటి ముందస్తు నోటీసులు, సమాచారం లేకుండా విధుల్లోంచి తొలగించడంతో తమ కుటుంబాల పరిస్థితి ఏమిటంటూ వారు ఆందోళన చెందుతున్నారు. తక్షణం తమను విధుల్లోకి తీసుకుని ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతున్నారు.

రాజకీయ దురుద్దేశంతోనే..

క్లాప్ ఆటో డ్రైవర్లను రాజకీయ దురుద్దేశంతోనే విధుల నుంచి తొలగించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైఎస్సార్ సీపీ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా 5,300 క్లాప్ ఆటోలను ప్రవేశ పెట్టారు. వీటి నిర్వహణ బాధ్యతను నాలుగు ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించారు. ఇందులో భాగంగా ఏలూరులో స్వయంభు అనే ఏజెన్సీ క్లాప్ ఆటోలను నిర్వహిస్తుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా వైఎస్సార్ సీపీ కాంట్రాక్టర్లే లబ్ధి పొందుతున్నారనే అక్కసుతోనే పాతవారిని తొలగించేందుకు క్లాప్ ఆటోల సేవలను నిలుపుదల చేస్తున్నారనే వాదనలు ఉన్నాయి.

బకాయిలతో సేవలు నిలుపుదల

గతంలో వార్డు సచివాలయాల వారీగా చెత్త పన్ను సేకరించి, వాటి నుంచి క్లాప్ ఆటోలు నిర్వహించే ఏజెన్సీలకు సొమ్ము చెల్లించేవారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చెత్త పన్ను రద్దుచేయడంతో ఆ భారం కార్పొరేషన్‌పై పడింది. దీంతో కార్పొరేషన్ నిర్వహణ బాధ్యతల నుంచి తప్పుకునేందుకు క్లాప్ ఆటో సేవలను నిలుపుదల చేశారు.

పని చేసే వాహనాలు 60

ఏలూరు కార్పొరేషన్ పరిధిలో క్లాప్ వాహనాలు ప్రారంభించిన తొలిరోజుల్లో మొత్తం 90 వాహనాలు సేవలు అందించేవి. తాజాగా వాటి సంఖ్య 60కి చేరింది. దాదాపు 30 వాహనాలు రిపేర్లు వచ్చి మూలన పడ్డాయి. వీటిని సరిచేసి తిరిగి రోడ్లపై తిరిగేలా చేయడంలోనూ కార్పొరేషన్ అధికారులు అలసత్వం వహించారనే విమర్శలు ఉన్నాయి.

తక్షణం విధుల్లోకి తీసుకోవాలి



ఏలూరు కార్పొరేషన్ పరిధిలోని క్లాప్ ఆటో డ్రైవర్లను తక్షణం విధుల్లోకి తీసుకోవాలి. వారికి ముందస్తు సమాచారం, నోటీసులు లేకుండా విధుల నుంచి తొలగించడం దుర్మార్గం. పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాల బకాయిలను తక్షణం చెల్లించాలి. ఏడాది నుంచి పీఎఫ్‌లో వాటాను జమ చేయాలి.

– బి.సోమయ్య, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఏలూరు

తొలగించడం అన్యాయం



చేస్తున్న పని నుంచి ఆకస్మాత్తుగా తొలగించడం అన్యాయం. చేస్తున్న పని నుండి తొలగిస్తే ఎలా బతకాలి. మాకున్న ఒక్క ఆధారం పోతే ఏం చేయాలి. మాలాంటి చిరు ఉద్యోగుల పట్ల కూటమి ప్రభుత్వం పెద్ద మనసుతో ఆలోచించి తిరిగి విధుల్లోకి తీసుకోవాలి. మాకు ఉద్యోగ భద్రత కల్పించాలి.

– జి.శ్రీను, క్లాప్ ఆటో డ్రైవర్, ఏలూరు నగరపాలక సంస్థ

వేతనాలు చెల్లించాలి



ముందస్తు సమాచారం లేకుండా తమను విధుల్లోంచి తొలగించడం బాధాకరం. సాఫీగా సాగే మాకుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఏర్పడింది. మాలాంటి చిన్న డ్రైవర్లపై ప్రతీకారం తీసుకోవడం దారుణం. అసరమైతే నగరపాలక సంస్థ మాకు వేతనాలు చెల్లించే విధంగా విధులు కల్పించాలి.

– జి.రాజు, క్లాప్ ఆటో డ్రైవర్, ఏలూరు నగరపాలక సంస్థ

నగరపాలక సంస్థ తీరు దారుణం



గత మూడున్నరేళ్లుగా చేస్తున్న విధుల నుంచి ఆకస్మాత్తుగా తొలగించడం దారుణం. ప్రైవేట్ సంస్థలను తలదన్నే విధంగా ఏలూరు నగరపాలక సంస్థ ఇటువంటి నిర్ణయం తీసుకోవడం సరి కాదు. విధుల నుంచి తొలగిస్తే మేము ఎక్కడికి వెళ్లాలి. దీనిపై నగరపాలక సంస్థ పునరాలోచన చేయాలి.

– బి.శ్రీను, క్లాప్ ఆటో డ్రైవర్, ఏలూరు నగరపాలక సంస్థ

పట్టిసం ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన



అనిస్త్రీ, పునిస్త్రీ ఆలయం వద్ద పూజ చేస్తున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

పోలవరం రూరల్: మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా పట్టిసం శివక్షేత్రం వద్ద చేపట్టే ఏర్పాట్లను డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు పరిశీలించారు. పట్టిసం రేవులో, నది దాటే ప్రదేశంలో ఏర్పాటు చేసే పంట్లు ప్రదేశాలను క్షేత్రం వద్ద భక్తులు దైవదర్శనానికి వీలుగా ఏర్పాటు చేసే క్యూలైన్లు, తదితర ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. గ్రామ పంచాయతీ, ఫెర్రీ కాంట్రాక్టర్, దేవస్థానం అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామిని దర్శించుకున్నారు. క్షేత్రం వద్ద అనిస్త్రీ, పునిస్త్రీ ఆలయానికి సంబంధించి పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. సీఐ సురేష్ బాబు, ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

బడ్జెట్ పత్రాల దహనం

నిడమర్రు: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందంటూ సోమవారం బువ్వనపల్లిలో సీపీఎం ఆధ్వర్యంలో తాజా బడ్జెట్ పత్రాలను దగ్ధం చేసారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు నారపల్లి రమణారావు మాట్లాడుతూ కేంద్ర ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి మళ్లీ మొండి చేయి చూపించిందన్నారు. వెనుకబడిన జిల్లాలకు, జాతీయ ఉపాధి హామీ ఊసే లేదన్నారు. కార్యక్రమంలో కోన శ్రీనివాస్, గవర సత్యనారాయణ, లావేటి సోంబాబు తదితరులున్నారు.

శాంతితోనే నవ సమాజ నిర్మాణం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): శాంతితోనే నవ సమాజ నిర్మాణం సాధ్యపడుతుందని అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ నూరుల్ ఇస్లాం శాఖ రాష్ట్ర ప్రజా సంబంధాల అధికారి ముహమ్మద్ జావిద్ అహ్మద్ పాషా అన్నారు. ప్రపంచ శాంతి స్థాపన కోసం ఆంధ్రప్రదేశ్ పర్యటనలో భాగంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పర్యటిస్తూ సోమవారం ఆయన ఏలూరు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా శాంతి, సౌభ్రాతృత్వాన్ని ప్రోత్సహించేందుకు శాంతి సమ్మేళణాలు, సెమినార్లు, చర్చాగోష్ఠిలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సర్వ ధర్మాల అవతార పురుషులను పరస్పరం గౌరవించుకున్నప్పుడే ప్రపంచంలో శాంతిని స్థాపించవచ్చన్నారు. జిల్లా మీడియా ప్రతినిధి మునవ్వర్ అహ్మద్ మస్తాన్ మాట్లాడుతూ అహ్మదియ్య ముస్లిం కమ్యూనిటీని హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ 1889వ సంత్సరంలో పంజాబ్ రాష్ట్రం, ఖాదియాన్ నగరంలో స్థాపించి, శాంతి స్థాపన కోసం నేడు 200లకు పైగా దేశాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రపంచ శాంతి కోసం కమ్యూనిటీ ఐదవ ఖలీఫా (ఉత్తరాధికారి) హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ నేతృత్వంలో అందరినీ ప్రేమించు.. ఎవ్వరినీ ద్వేషించకు అనే నినాదంతో హ్యూమానిటీ ఫస్ట్ శాఖ ఆధ్వర్యంలో మానవ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

రాష్ట్రపతి అవార్డు గ్రహీత జెస్సీకి ఘన సత్కారం

దెందులూరు : రాష్ట్రపతి అవార్డు గ్రహీత ఇంటర్నేషనల్ స్కేటర్ మాత్రపు జెస్సీకి సోమవారం స్వగ్రామం జోగన్నపాలెంతోపాటు గోపన్నపాలెంలో ఘన స్వాగతం లభించింది. జోగన్నపాలెంలో సర్పంచ్ పసుమర్తి రాజేశ్వరి, మాజీ సర్పంచ్ పసుమర్తి ప్రభాకరరావు, సొసైటీ మాజీ చైర్మన్ పసుమర్తి మధు, గ్రామస్తులు జెస్సీకి పౌర సన్మానం చేశారు. జెస్సీ నివాసంలో సీఎస్ఐ చర్చి కౌన్సిల్ చైర్మన్ రెవరెండ్ ఆనంద్ కొండ, డీనరీ చైర్మన్ రఘువరన్, అలెగ్జాండర్ ప్యారిస్ పాస్టర్ జోగన్నపాలెం, పాస్టర్ ఇతర గ్రామాల పాస్టర్లు ప్రత్యేకంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు. గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నతానియేలు, ఫిజికల్ డైరెక్టర్లు, లెక్చరర్లు, కళాశాల సిబ్బంది విద్యార్థులు అవార్డు గ్రహీత జెస్సీకి రహదారి నుంచి కళాశాల వేదిక వరకు గౌరవ వందనం సమర్పించారు. ఆమెను ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

డిప్యూటీ మేయర్ల ఎన్నిక ఏకగ్రీవం

ఎన్నికలను బహిష్కరించిన వైఎస్సార్ సీపీ





డిప్యూటీ మేయర్‌గా కార్పొరేటర్లు దుర్గాభవాని, ఉమామహేశ్వరరావులకు డిక్లరేషన్ అందిస్తున్న జేసీ

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ల ఎన్నిక ప్రశాంతంగా జరిగింది. 30వ డివిజన్ కార్పొరేటర్ పప్పు ఉమామహేశ్వరరావు, 47వ డివిజన్ కార్పొరేటర్ వందనాల దుర్గాభవానిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఏలూరు నగరపాలక సంస్థ సమావేశపు హాలులో సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్, ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి పి.ధాత్రిరెడ్డి ఆధ్వర్యంలో నగరపాలక సంస్థలో ఖాళీగా ఉన్న రెండు డిప్యూటీ మేయర్ స్థానాలకు ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. కార్యక్రమానికి 30 మంది కార్పొరేటర్లు హాజరయ్యారు. 20 మంది వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు బహిష్కరించారు. కార్పొరేటర్ పప్పు ఉమామహేశ్వరరావు నామినేషన్‌ను 36వ డివిజన్ కార్పొరేటర్ భీమవరపు హేమసుందరి ప్రతిపాదించగా, 12వ డివిజన్ కార్పొరేటర్ కర్రి శ్రీనివాసరావు బలపరిచారు. వందనాలు దుర్గాభవానిని అభ్యర్థిత్వాన్ని 37 డివిజన్ కార్పొరేటర్ పృథ్వీ శారద ప్రతిపాదించగా 28వ డివిజన్ కార్పొరేషన్ తంగిరాల అరుణ బలపరిచారు. ఇతర కార్పొరేటర్లు ఎవరూ నామినేషన్లు దాఖలు చేయని కారణంగా ఉమామహేశ్వరావు, దుర్గాభవానిలు డిప్యూటీ మేయర్లుగా ఎంపికైనట్టు జేసీ పి.ధాత్రిరెడ్డి ప్రకటించి వారికి ధ్రువీకరణ పత్రాలను అందించారు. ఉమామహేశ్వరరావు, దుర్గాభవానిలను ఎమ్మెల్యే బడేటి చంటి, మేయర్ షేక్ నూర్జహాన్, కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు తదితరులు అభినందించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భానుప్రతాప్, అదనపు కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేటర్ల అసంతృప్తి

వైఎస్సార్ సీపీ హయాంలో ఇద్దరు డిప్యూటీ మేయర్ల పదవుల్లో ఒకటి బీసీ సామాజిక వర్గానికి, మరొకటి ఎస్సీ సామాజిక వర్గానికి కేటాయించారు. నేడు కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యే బడేటి చంటి రెండు డిప్యూటీ మేయర్ల స్థానాలను బీసీ సామాజిక వర్గానికే చెందిన వారికి ఇవ్వడం పట్ల ఎస్సీ కార్పొరేటర్లలో కొంతమేర అసంతృప్తి కన్పించింది. కాగా డిప్యూటీ మేయర్ల ఎన్నిక ప్రక్రియ మొత్తం 20 నిముషాల్లోనే ముగించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	35
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	41
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	13
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	18
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	30
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	28
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	26
ఏలూరు-బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	31
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	32
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	30
ఏలూరు - తిరుపతి	16.00	4830	34
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	23

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	16	చిక్కుడు కాయలు	36
వంకాయలు (కాంతులు)	20	బీన్సచిక్కుడు	50
వంకాయలు (తెలుపు)	20	చామదుంపలు	44
బెండకాయలు	36	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	28	కంద	68
కాకర కాయలు	34-40	బీట్‌రూట్	30
బీరకాయలు	38	కీరా దోస	36
బీరకాయలు (పందిరి)	46	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	20	అల్లం	60
క్యారెట్	30	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	34	పాలకూర	10
బంగాళదుంపలు	30	చుక్కకూర	10
ఉల్లిపాయలు	40	తోటకూర	10
గోరుచిక్కుడు	28	గోంగూర	07-10
దోసకాయలు	28-34	పుదీనా	05
ఆనపకాయ (1)	20-25	క్యాప్సికమ్	56
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	36

జిల్లా స్థాయి యూత్ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక



యూత్ బాస్కెట్‌బాల్ పోటీల్లో ఎంపికైన విద్యార్థులు

దెందులూరు: కొవ్వలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాలుర బాలికల యూత్ బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించినట్టు హెచ్ఎం ఎస్ఎల్ఎన్‌వీజీ శర్మ తెలిపారు. ఈ పోటీలకు సుమారు 80 మంది క్రీడాకారులు హాజరయ్యారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఈ నెలలో నిర్వహించనున్న ఏపీ యూత్ అంతర్ జిల్లాల చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు.

విద్యార్థినులకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందుకున్న విద్యార్థినులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థినులు అన్ని రంగాల్లోనూ పట్టు సాధించాలని సీఆర్ఆర్ మహిళా కళాశాల కరస్పాండెంట్ చలసాని విశ్వనాథరావు అన్నారు. సీఆర్ఆర్ మహిళా కళాశాలలో ఇటీవల విద్యార్థినులకు నిర్వహించిన సాంస్కృతిక, సాహిత్య క్రీడా వారోత్సవాల్లో విజయం సాధించిన వారికి సోమవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విశ్వనాథరావు మాట్లాడుతూ ఇటీవల క్రీడల్లో తెలుగు అమ్మాయిలు అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తూ దేశానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకొస్తున్నారని తెలిపారు. సీఆర్ఆర్ మహిళా కళాశాలలో విద్యాభ్యాసం చేసిన వారిలో అనేక మంది దేశ విదేశాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని వివరించారు. వీరిని ఆదర్శంగా తీసుకుని ప్రస్తుత విద్యార్థినులు మరింతగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.సరళ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు గోదావరి కాలువ గట్ల ఆక్రమణ



గోదావరి కాలువ గట్లపై నిర్మించిన షెడ్లు



చెట్లను నరికి వేస్తున్న దృశ్యం

- భారీ వృక్షాలను నరికివేస్తున్న ఆగంతకులు
- రోజు రోజుకీ కుంచించుకుపోతున్న కాలువ వెడల్పు

దెందులూరు: మండలంలో సాగుకు, తాగునీటికి అత్యంత కీలకమైన, అతి ప్రధానమైన ఏలూరు గోదావరి కాలువ రోజురోజుకీ ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లి విస్తీర్ణం తగ్గి కుంచించుకుపోతోంది. దానికి తోడు కాలువ గట్లపై 40- 50 ఏళ్ల వయసు కలిగిన భారీ వృక్షాలను కొందరు అక్రమంగా ఉద్యోగుల సహకారంతో నరికివేస్తున్నారు. గట్లను ఆక్రమించేందుకు చెట్లను నరికి కలపను విక్రయించి సొమ్ము దోచుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాలువ గట్లుపై ఏళ్ల నాటి చెట్టు ఆకులు, కొమ్మలతో పచ్చగా ఉన్నప్పటికీ సమీప ప్రాంతంలో పెట్టిన మంట కారణంగా చెట్ల మొదలులో తొర్ర పడింది. దీంతో భారీ వృక్షాన్ని నరికి వేస్తున్నట్టు ఉద్యోగులు తెలిపారు. న్యాయవాది కంజీరమణ, స్థానికులు ఘటనా స్థలానికి వెళ్లి నిలదీయడంతో పనులను నిలుపుదల చేశారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి ఆయన తీసుకెళ్లారు. ఫొటోలు, వీడియోలు వారికి పంపించారు. అన్ని శాఖల ఉద్యోగుల నిర్లక్ష్యంపై న్యాయపరంగా పోరాటం చేస్తామని, వారం రోజుల కిందట మండల అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశానని న్యాయవాది తెలిపారు. దీనికి తోడు నిబంధనలకు విరుద్ధంగా భీమడోలు నుంచి గుండుగొలను జంక్షన్, సింగవరం వద్ద పెద్ద ఎత్తున కాలువ గట్టున సర్వీసింగ్ పాయింట్, హోటల్, టైర్ల కొట్టు, బడ్డీ కొట్టు, టీ కొట్టు ఏర్పాటు చేశారని ఆయన అన్నారు. దెందులూరు జాతీయ రహదారి నుంచి కొవ్వలి వచ్చే అడ్డ రోడ్డు వద్ద కాలువను ఆక్రమించి ఇటుకల బట్టీలు, పశువులకు గడ్డి, గడ్డి వాములు, షెడ్లు సైతం నిర్మించి దర్జాగా అనుభవిస్తున్నారని పలువురు ఆరోపించారు. 1988లో దెందులూరు గ్రామానికి చెందిన కొంతమంది పేదలకు అప్పటి ప్రభుత్వం చెట్టు పట్టా పథకం కింద కొంత భూమిని మొక్కలు పెంచుకునేందుకు అందించింది. కొంత మంది అక్రమార్కులు ఆ భూమిని స్వాధీన పరుచుకుని దశాబ్దాల కాలంగా పెరిగిన చెట్లను నరికివేస్తున్నారని న్యాయవాది అన్నారు. ఈ సమస్యపై దెందులూరుకు చెందిన కొంతమంది ఎంపీడీవో, ఇరిగేషన్ శాఖ అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దెందులూరు మండల రెవెన్యూ కార్యాలయ సిబ్బంది ఇరిగేషన్ కాలువ గట్టును పరిశీలించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గోదావరి కాలువపై ఆక్రమణలు తొలగించాలని, చెట్ల తొలగింపును నిలుపుద చేయాలని ప్రజలు, రైతులు, రైతు సంఘం నాయకులు కోరుతున్నారు.

నేటి నుంచి అచ్చమ్మ పేరంటాలు ఉత్సవాలు

దెందులూరు: గాలయగూడెం అచ్చమ్మ పేరంటాలు తల్లి 68వ వార్షిక ఉత్సవాలు మంగళవారం నుంచి తొమ్మిది రోజులుపాటు జరగనున్నాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం ఉదయం దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఉత్సవాలను ప్రారంభిస్తారు. పెదవేగి సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పెదవేగి సర్కిల్లోని ఎస్సైలు హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ మహిళా పోలీసులు ఉత్సవాల్లో అవుట్ పోస్ట్ ఏర్పాటు చేసి భక్తులకు అసౌకర్యం కలగకుండా విధులు నిర్వహిస్తారు.